

ఎస్టీపీ సందర్శన

రామగుండం: పాతబజార్ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)ని అదనపు కలెక్టర్ అరుణశ్రీ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. నీటి శుద్ధి ప్రక్రియను ఆమె పరిశీలించారు.



టీవీలకు దూరంగా ఉండాలి

ఓదెల: విద్యార్థులు టీవీలు, ఫోన్లకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని డీఈవో మాధవి సూచించారు. మడక యూపీఎస్‌ను ఆమె సందర్శించి విద్యార్థులకు టై, బెల్ట్‌లు అందజేశారు.

గరిష్టం/కనిష్టం
27.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో అత్యధికంగా తేమ నమోదవుతుంది. జిల్లాలోని పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అడిషనల్ న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు సూచించారు. స్థానిక సెక్టర్–3 సింగరేణి పాఠశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. అపరిచితులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచాం అందించాలన్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరిఖని ఏసీపీ రమేశ్, అధికారులు, ప్రతినిధులు అనిల్‌కుమార్, సతీశ్, శైలజ, శ్రీనివాస్, భూమయ్య, అనూరాధ, సురేశ్, చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండండి



శ్రీధర్‌బాబు

మంథని: భారీవర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని మంత్రి శ్రీధర్‌బాబు కలెక్టర్లు, పోలీసు అధికారులకు సూచించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగే ప్రమాదం ఉందని, వరదలకు ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. విపత్తులను ఎదుర్కొనేందుకు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండి, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని మంత్రి కోరారు.

కార్మిక కుటుంబాలకు పరామర్శ

గోదావరిఖని: అనారోగ్యంతో బాధపడుతూ సింగరేణి ఏరియా ఆస్పత్రిలోచికిత్స పొందుతున్న పలు కార్మిక కుటుంబాలను రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ శనివారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని, మస్తాఫా ఉన్నారు.

అటవీ అధికారి బదిలీ

మంథని: మంథని అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీనివాసరావు కొత్తగూడెం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నిర్మల్ జిల్లాకు చెందిన అటవీ రేంజ్ అధికారి రమేశ్ రాథోడ్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఈమేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

హక్కులు కల్పించండి



వినతిపత్రం అందిస్తున్న కృష్ణ, వెంకన్న

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆర్జీ–2 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా వేతనాలు లేదా 22వ జీవో అమలు చేయాలన్నారు. వయసు పైబడి ఉద్యోగ విరమణ చేసిన కాంట్రాక్టు కార్మికుడి స్థానంలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన కోరారు. హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, ప్రతీనెల 7వ తేదీన వేతనాలు ఇవ్వాలని, ఏడాదికోసారి సీఎంపీఎఫ్ లెక్కల వివరాలు వెల్లడించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, అశోక్, బుచ్చమ్మ, కుందారపు శారద, బండ పద్మ, రాజనర్సు, వేముల రమేశ్, ప్రేమ్‌కుమార్, ఎం.మల్లయ్య, ఎం.కాంతయ్య, ఎం.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

23న జాబ్ మేళా


పెద్దపల్లిరూరల్/రామగుండం: పెద్దపల్లి, హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీల్లో సిబ్బంది నియామకం కోసం ఈనెల 23న జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ శనివారం తెలిపారు. పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయం వెనకాల జాబ్ మేళా ఉంటుందన్నారు. జీ–4ఎస్ సెక్యూరిటీ కంపెనీకి 19 నుంచి 40 ఏళ్లలోపు వయస్సుగల పురుష సిబ్బంది అవసరమన్నారు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. అలాగే పెద్దపల్లిలోని రెప్యుటెడ్ రిటెయిల్ స్టోర్స్‌లో పనిచేసేందుకు ఆడ, మగ సిబ్బంది ఇంటర్, డిగ్రీ చదివిన వారు ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

సర్టిఫికెట్లు తీసుకెళ్లండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఈఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన డ్రాయింగ్, టైలరింగ్ (లోయర్, హయ్యర్) పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ హాల్ టికెట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో వచ్చి పాస్ సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

షరతులు వర్తిస్తాయి..

- రేషన్‌కార్డు, ఆధార్ లింకేజీ, పీఎం కిసాన్ ప్రామాణికం
- రుణాలు ముందే చెల్లించినా, రీషెడ్యూల్ చేసుకున్నా వర్తించని వైనం
- మిగిలిన అవుట్ స్టాండింగ్ రుణం మాత్రమే మాఫీ
- అర్హులైనా తమకు మాఫీ కాలేదని రైతుల ఆవేదన
- బ్యాంకులు, రైతు వేదికలకు బారులు తీరిన అన్నదాతలు
- మళ్లీ దరఖాస్తు చేస్తే వర్తింపజేస్తామని సూచన



6	7	8
31030		మంజూరు అయిన రుణం కన్నా 9.12.2023 నాటికి బకాయి ఉన్న వక్కి ఎక్కువగా ఉన్నది.
31030		

ఆన్‌లైన్‌లో రుణమాఫీ స్టేటస్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రైతు రుణమాఫీ విషయంలో అర్హులకు అన్యాయం జరిగిందని విమర్శలు వినిపిస్తున్న వేళ.. అధికారులు పలు కొత్త కారణాలు చెబుతున్నారు. రేషన్‌కార్డు ప్రామాణికం కాదని చెప్పినప్పటికీ.. వాస్తవానికి కుటుంబాల గుర్తింపులో వాటినే ప్రామాణికంగా తీసుకున్నారని అధికారులే చెబుతుండటం గమనార్హం. మరోవైపు.. రూ.లక్షలోపు రుణం తీసుకున్న వారిలో ఉమ్మడి జిల్లాలో 1.24 లక్షల మందికి రుణం మాఫీ కాగా.. వాస్తవానికి గత ప్రభుత్వంలో ఈసంఖ్య 3 లక్షలు దాటి ఉంది. వారిలో మిగిలిన వారంతా తమకు ఎందుకు రుణమాఫీ కాలేదని దాదాపుగా రెండు లక్షల మంది కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో శనివారం ఉదయం నుంచే రైతువేదికలు, బ్యాంకులకు పోటెత్తారు.అక్కడ అధికారులు చెప్పిన కారణాలు విని కొందరు రుణమాఫీపై ఆశలు వదులుకోగా.. మిగిలిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

అసలేంటి ఆ కారణాలు?

- వాస్తవానికి ప్రభుత్వం ఆదినుంచీ చెబుతున్నట్లు తాను విధించిన నిబంధనల మేరకు మాఫీ చేసింది.
- అందులో మొదటగా.. కాలపరమితి 12–12–2018 నుంచి 09–12–2023 మధ్య రుణం తీసుకుని ఉండాలి. అలా కాకుండా అంతకుముందు, ఆ తర్వాత తీసుకున్న వారికి రుణమాఫీ కాలేదు.
- ఐదేళ్లలో పంట రుణం తీసుకుని మొత్తాన్ని(రుణవాయిదా) బ్యాంకులకు చెల్లిస్తే.. ఆ రుణాలకు మాఫీ వర్తించదు.
- 09–12–2023 నాటికి లోను ఖాతాలో ఉన్న అవుట్ స్టాండింగ్ అమౌంట్ ఎంత ఉంటే అంత మాత్రమే మాఫీ అయింది. ఉదాహరణకు రూ.లక్ష రుణం తీసుకున్న వ్యక్తి పేర్కొన్న తేదీ 09–12–2023 నాటికి రూ.50 వేలు చెల్లించాడనుకుందాం.. అతనికి ఇపుడు కేవలం రూ.50 వేలు మాత్రమే మాఫీ అవుతుంది. వీరు తమకు రూ.లక్షకు బదులు రూ.50 వేలే మాఫీ అయ్యాయని వాపోతున్నారు.
- రేషన్‌కార్డు లేనివారికి రుణాలు మాఫీ కాలేదు. ప్రభుత్వం పాసుబుక్కులు ప్రామాణికమని చెప్పినప్పటికీ.. క్షేత్రస్థాయిలో అది పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. రేషన్‌కార్డులో సభ్యులు కానివారు, రేషన్ కార్డులో పేరు ఉండి వారి ఆధార్ లింక్ లేక పోయిన వారికి రుణం మాఫీ కాలేదు.
- రుణం తీసుకుని, చెల్లించేందుకు వీలుగా రీషెడ్యూల్ చేసుకున్న వారికి కూడా రుణమాఫీ వర్తించలేదు.
- వీటితోపాటు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వర్తించని వారికి కూడా రుణమాఫీ అవలేదు. ఈ కారణాల ఫలితంగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 2 లక్షల మందికిపైగా రైతులు రుణమాఫీకి దూరంగా ఉన్నారని సమాచారం.
- గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో తొలిదఫాలో 3,77,984 మంది రైతులకు రూ.1,693.52కోట్లు మాఫీ చేసింది. రెండోసారి దశల వారీగా 3,73,213 మందికి రూ.1,191కోట్లు రద్దు చేసింది. ప్రస్తుతం రుణమాఫీలో ఉమ్మడి జిల్లాలో 1,24,167 మందికి రూ.688.42 కోట్లు మాఫీ అయ్యింది. ఈ లెక్కన చూసినపుడు దాదాపు 2.50 లక్షల మంది రైతులు రుణమాఫీకి దూరంగా ఉన్నారని సమాచారం.



మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు



పలు కారణాలతో కొందరు రైతులకు రుణమాఫీ కాలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాకుండా.. అర్హత ఉండి, రుణాలు మాఫీ కాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకునే వీలుంది. ప్రభుత్వం నిబంధనలు ప్రకారం వారికి రుణమాఫీ చేస్తుంది. అర్హులైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– శ్రీనివాస్, డీఏవో, కరీంనగర్

రుణమాఫీ కాలేదు



నాకున్న ఇరవై గుంటలపై 2020లో ఆంధ్రాబ్యాంక్(యూనియన్ బ్యాంక్)క్రాఫ్ లోన్ రూ.20వేలు ఇచ్చారు. కానీ, నాకు రుణమాఫీ కాలేదు. బ్యాంకర్లను అడిగితే లిస్ట్‌లో పేరు రాలేదంటున్నారు. ఇదెక్కడి న్యాయం? కూలీనాలీ చేసుకొని బతుకుతున్న నాకే రుణమాఫీ కాలేదంటే ఎట్లా? రూ.లక్షలోపు రుణమాఫీ చేశామని సీఎం చెప్పుతుండు. కానీ.. మాలాంటి రైతులకు ఎంతో మందికి రుణమాఫీ కాలేదు.

– కూచనపల్లి రాజు, రైతు, వీణవంక

పాస్‌పుస్తకంతో తీసుకున్న



ఒకేదఫాలో పంటరుణం మాఫీ చేస్తామని ప్రభుత్వం అంది. నాకున్న భూమి పట్టాపాసు పుస్తకం పెట్టి బ్యాంక్‌లో రూ.64 వేలు పంట రుణం తీసుకున్న. ప్రభుత్వం మొదట లక్ష రూపాయలు లోన్ ఉన్న వారికి మాఫీ చేస్తామని చెప్పింది. నాకు రేషన్ కార్డు, పాస్ పుస్తకం ఉన్నా లోన్ మాఫీ కాలేదు. అధికారులను అడిగితే నా పేరుకు బదులు మరొకరి పేరు ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నరు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

–విరగోని శ్రీనివాస్, కాట్నపల్లి

ప్రజారోగ్యమే ప్రధానం

- ఖాళీ స్థల యజమానులకు నోటీసులు
- పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు
- కుక్కలు, కోతుల బెడద నివారిస్తాం
- మంథని మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్
- 'సాక్షి ఫోన్ ఇన్'కు స్పందన



'సాక్షి' ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్

సాక్షి ఫోన్ ఇన్

మంథని: నివాసాల మధ్య ఖాళీ స్థలాలతో పారిశుధ్య సమస్య తలెత్తుతోందనే ఫిర్యాదుల నేపథ్యంలో యజమానులకు నోటీసులు జారీ చేస్తామని, ప్రజారోగ్యమే ప్రధానమని మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 'సాక్షి' శనివారం చేపట్టిన సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి చక్కటి స్పందన లభించింది. మురుగునీటి నిల్వలు, పారిశుధ్య లోపం, డ్రైనేజీల్లో పూడికతీత, కుక్కలు, కోతుల బెడద, వీధి దీపాలు వెలగడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ కొన్నింటిని ఫోన్ ద్వారానే తక్షణం పరిష్కరించారు. వీధి దీపాలు అమర్చే సిబ్బందితో మాట్లాడి 24 గంటల్లో సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. మిగతా ఫిర్యాదులను నమోదు చేసుకున్న ఆయన.. చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వివరాలు..

- మురుగు నీటికాల్వలు, రోడ్లు శుభ్రం చేయించండి
  – ఇనుముల సతీశ్, ఏడోవార్డు, భగత్‌నగర్

కమిషనర్: పారిశుధ్యం మెరుగు పర్చుతున్నాం. డ్రైనేజీల్లో దోమల నివారణ మందు చల్లిస్తున్నాం. నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నాం.

- మిషన్ భగీరథ మరమ్మతు చేయించండి
  – బెజ్జంకి దిగంబర్, శ్రీపాదకాలనీ

కమిషనర్: ఫిల్టర్‌బెడ్‌కు మరమ్మతు చేయిస్తాం. డ్రైనేజీలు శుభ్రం చేయిస్తాం.

- లైన్‌గడ్డలో వర్షపు నీటితో ఇబ్బంది పడుతున్నాం
  – మహమ్మద్ మున్నీర్, లైన్‌గడ్డ, నాల్గోవార్డు

కమిషనర్: వర్షపు నీటిని జేసీబీ సాయంతో బొక్కలవాగు కట్టకు తరలిస్తాం. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం.

- బ్రిడ్జి రోడ్డులో దుర్వాసన వస్తున్నది
  – రమేశ్, మూడోవార్డు, బ్రిడ్జి రోడ్డు

కమిషనర్: దుర్వాసనకు కారణమైన వ్యర్థాలు తొలగిస్తాం.

- ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలున్నయ్. దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నయ్. వ్యాధులకు గురవుతున్నం.
  – నార్ల విజయభాస్కర్, నడివీధి

కమిషనర్: వార్డు ఆఫీసర్‌కు ఆదేశాలు జారీచేసి యజమానికి నోటీసులు జారీ చేస్తాం. స్పందించకుంటే ఖాళీ స్థలాలు స్వాధీనం చేసుకుంటాం.

- గౌడ్స్, రావుల చెరువుకట్టలో వీధి దీపాలు వెలగడం లేదు
  – మాదిశెట్టి నారాయణ, కనపర్తి సతీశ్

కమిషనర్: సెక్షన్ ఇన్‌చార్జికి ఆదేశాలు జారీ చేశాం. 24గంటల్లో సమస్య పరిష్కారమవుతుంది.

- మంచినీటి నల్లాలకు కరెంటు మోటార్లు పెడుతున్నారు
  – మల్లికార్జున్, అంబేడ్కర్‌నగర్

కమిషనర్: సెక్షన్ ఇన్‌చార్జి ద్వారా సమస్య పరిష్కరిస్తాం.

- స్టేషన్‌రోడ్డులో వేపచెట్టు ప్రమాదకరంగా ఉంది
  – బూడిద తిరుపతి, పోలీస్‌స్టేషన్ రోడ్డు

కమిషనర్: ప్రమాదకరమైన వేపచెట్టు కొమ్మలు తొలగిస్తాం.

- మా ఇళ్లలోకి వర్షపునీరు వస్తున్నది
  – అంజయ్, గంగాపురి

కమిషనర్: మురుగునీటి కాల్వలో పూడిక తీయిస్తాం. సమస్య పరిష్కరిస్తాం.

- కుక్కలు, కోతుల బెడద భరించలేకున్నం
  – బోగోజు శ్రీనివాస్, పెంజేరుకట్ట

కమిషనర్: కుక్కలు, కోతులతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం.

- కొత్తకాలనీలో సౌకర్యాలు కల్పించండి
  – గణపతి రజిత, పోచమ్మవాడ

కమిషనర్: సౌకర్యాల కల్పనకు ప్రణాళిక సిద్ధం చేస్తాం. బల్దియాకు ఇటీవల మంజూరైన నిధుల్లోంచి కొన్ని వెచ్చించి రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తాం. సౌకర్యాలు కల్పిస్తాం.

జలకళ.. భరోసా నింపేలా..

- జిల్లావ్యాప్తంగా ఏకధాటి వర్షం
- చెరువులు, కుంటల్లో చేరుతున్న వరదనీరు
- ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ప్రారంభమైన ఇన్‌ఫ్లో
- సింగరేణి ఓసీపీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి



మత్తడి దూకుతున్న ఓదెల మండలం గోపరపల్లెలోని చెరువు

సాక్షి, పెద్దపల్లి: వానాకాలం ఆరంభమై నెలన్నర దాటినా లోటు వర్షపాతమే నమోదు కావడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. అయితే, మూడ్రోజులుగా కురుస్తున్న ఏకధాటి వానలు ఆ లోటును పూడ్చివేస్తున్నాయి. ఎడతెరిపి లేనివానలతో జిల్లాలోని చెరువులు, కుంటల్లోకి కొత్తనీరు వచ్చి చేరుతూ జలకళ సంతరించుకోగా.. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాయుగుండం ప్రభావంతో..

వాయుగుండం ప్రభావంతో జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వర్షం తెరిపివ్వక పోగా, రాత్రి వరకూ ముసురు వీడలేదు. దీంతో చెరువులు, కుంటల్లోకి వరద పోటెత్తింది. మరికొద్ది రోజులు భారీవానలు ఇలాగే కురిస్తే చెరువులు మత్తడిదూకేందుకు అవకాశం ఉంది. పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల మండలాలు మినహా అన్ని మండలాల్లో సాధారణానికి మించి వానలు కురిశాయి. జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం 8.30గంటల వరకు 59.6సెం.మీ. వర్షపాతం నమోదైంది.

అలుగు దుంకుతున్న 27 చెరువులు

జిల్లావ్యాప్తంగా 1,016 చెరువులు ఉండగా, వాటిలో 27 చెరువులు అలుగు దుంకాయి. మరో 226 చెరువులు 100శాతం నీటితో నిండాయి. రెండురోజులపాటు ఇదేవిధంగా వర్షాలు కురిస్తే చెరువులన్నీ మత్తడిపోస్తాయి. అయితే, అప్రమత్తమైన నీటిపారుదల శాఖ అధికారులు.. క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ కట్టలకు బుంగలు పడితే సమాచారం ఇవ్వాలని అన్నదాతలకు సూచిస్తున్నారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

రామగుండం ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రాత్రి షిఫ్ట్ మొదలుకొని ఎడతెరిపివ్వకుండా వర్షం కురిసింది. దీంతో మూడు షిఫ్టుల్లో కలిపి ఓసీపీ–1, 2, 3ల్లో రోజూ సుమారు 56 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. ఆదివారం సైతం ఇదే పరిస్థితి కొనసాగే వీలుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు వెలికితీసిన బొగ్గును రవాణా చేస్తున్నట్లు వారు తెలిపారు.

సాగుకు దన్నుగా

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు జిల్లాలో అన్నదాతల సాగుకు దన్నుగా నిలుస్తున్నాయి. వర్షంలో పనులు చేసుకోవడానికి ఇబ్బందులు పడినా.. చెరువులు నిండితే పంటకు ఢోకా ఉండదని హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సాగు లక్ష్యం 2,77,743 ఎకరాలు కాగా ఇప్పటికే 85,654 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ప్రస్తుతం వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో అన్నదాతలు పొలం పనుల్లో తలమునకలయ్యారు. కొన్నిచోట్ల భారీ వర్షాలతో పంట పొలాల్లో వర్షపు నీరు చేరితే యాజమాన్య పద్ధతులు పాటించాలని, తద్వారా పంటకు ఇబ్బందులేమీ ఉండవని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

గోదావరికి వరద

ఎగువన కురుస్తున్న భారీవర్షాలతో గోదావరి నది నీటి మట్టం ఆదివారం నాటికి పెరిగే అవకాశాలు ఉన్నాయని, నదీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎగువన, క్యాచ్‌మెంట్ ఏరియాల్లో కురుస్తున్న వర్షాలతో నీటిమట్టం పెరుగుతోంది. ఎల్లంపల్లి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, శనివారం రాత్రి వరకు 5.733 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

వర్షపాతం వివరాలు(మి.మీ.లలో)

ప్రాంతం	వర్షపాతం
ముత్తారం	27.3
కూనారం	21.3
మంథని	20.3
కాల్వశ్రీరాంపూర్	18.0
ఎలిగేడు	16.0
ఓదెల	15.8
భోజన్నపేట	14.3
రామగుండం	13.5

గ్రామాల్లోనే వైద్యసేవలు

- ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ సూచించారు. పత్తిపాకలో సీజనల్ వ్యాధులు, డెంగీ కేసులు నమోదు కావడంతో స్పందించి లక్ష్మణ్‌కుమార్.. జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, పీవో సుధాకర్‌తో కలిసి శనివారం పర్యటించారు. జ్వర బాధితులను పరామర్శించారు. వైద్య సిబ్బంది ఇంటింటా పర్యటించి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం విప్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు ఉన్నా.. కొందరు కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయించడం బాధాకరమన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో పేషెంట్లను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈనెల 23న కలెక్టర్ సమక్షంలో పత్తిపాకలో మెగా వైద్య శిబిరం చేపడతామని తెలిపారు. వైద్యాధికారి సుష్మిత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏపీఎం రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, విండో చైర్మన్ వెంకటరెడ్డి ఉన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ఆపదొస్తే సంప్రదించండి



ఇంటిని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్

పెద్దపల్లిరూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ సూచించారు. మరోరెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసం ఉండరాదని సూచించారు. తమ కార్యాలయంలోని హెల్ప్‌లైన్ నంబరు 63031 27484కు సమాచారం అందించాలన్నారు. పట్టణంలోని శాంతినగర్ ఎస్సారెస్పీ కాలువ ప్రాంతంలో పలువురి ఇళ్లు కూలిపోగా శనివారం పరిశీలించి సహాయక చర్యలు తీసుకోవాలని మేనేజర్ శివప్రసాద్‌కు సూచించారు. రంగంపల్లి వద్ద రహదారిపై నీళ్లు నిలవకుండా చర్యలు చేపట్టారు. మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్, రమాకాంత్, శంకర్, భూమేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి


శ్రీనివాస్

గోదావరిఖని: భారీవర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ శనివారం సూచించారు. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఆపదలో ఉంటే వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు.

పాత కక్షలతో దాడి


గాయపడిన తిరుపతి

మానకొండూర్: దేవంపల్లి గ్రామానికి చెందిన గాడిచెర్ల తిరుపతి (35)పై అదే గ్రామానికి చెందిన గాడిచెర్ల సాయికుమార్ శుక్రవారం రాత్రి గొడ్డలితో దాడి చేశాడు. సీఐ ఎం.రాజ్‌కుమార్ వివరాల ప్రకారం .. దేవంపల్లికి చెందిన గాడిచెర్ల తిరుపతి శుక్రవారం తన ఆటోలో రాత్రి పనిమీద బయటకు వెళ్లి ఇంటికి వస్తున్నాడు. గ్రామంలోని ఓ ఇంటివద్ద ఉన్న గద్దెపై గాడిచెర్ల సాయికుమార్, ముద్రవేని వంశీ కూర్చుని ఉన్నారు. తిరుపతి వారివద్ద ఆటో ఆపి 'రాత్రి ఇక్కడేం చేస్తున్నారు. ఇంటికెళ్లండని' సూచించాడు. దీంతో ఆగ్రహించిన సాయికుమార్ 'నువ్వేంటి నాకు చెప్పేదంటూ' తన ఇంటికెళ్లి తండ్రి రాజుకు విషయం చెప్పాడు. దీంతో రాజు, సాయికుమార్ గొడ్డలి తీసుకొని వచ్చి తిరుపతిపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన తిరుపతిని కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఇంటి ప్రహరి, వెనకాల ఉన్న మూడు గజాల భూమి విషయంలో గాడిచెర్ల రాజు, సాయికుమార్‌తో గొడవలు జరుగుతున్నాయని, పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని చంపాలనే ఉద్దేశంతో తిరుపతిపై దాడి చేసినట్లు ఆయన సోదరుడు రమేశ్ శనివారం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సైబర్‌క్రైం నిందితుడి అరెస్టు

- రూ.1.58 లక్షలు రికవరీ
- కరీంనగర్ జైలుకు తరలింపు

కరీంనగర్‌క్రైం: తెలంగాణ, తమిళనాడులోని పలు ప్రదేశాలతో పాటు కరీంనగర్‌లో సైబర్ క్రైం ద్వారా మోసం చేసిన రాజస్తాన్ జోద్‌పూర్‌కు చెందిన నిందితుడిని కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు శుక్రవారం జోద్‌పూర్‌లో అరెస్టు చేసి తీసుకొచ్చారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. టెలిగ్రాం యాప్‌లో రాజస్తాన్ రాష్ట్రం జోద్‌పూర్‌కు చెందిన అరుణ్‌చౌదరి అనే వ్యక్తి జోద్‌పూర్‌లోని గారిసన్ ఇంజినీర్ బనార్ (మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్)లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. క్రిప్టో ట్రేడింగ్‌లో పెట్టుబడులు చేయాలని ఒక 'ఏజెంట్ రిజర్వ్ ఆఫ్' అనే ప్రొఫైల్‌ను క్రియేట్ చేసి ఎరవేశాడు. కరీంనగర్‌కు చెందిన సాయికృష్ణ నమ్మి అరుణ్ చౌదరికి ఏప్రిల్ నెలలో రూ.1.58 లక్షలు పంపించాడు. తర్వాత టెలిగ్రాంలో నిందితుడు అరుణ్‌చౌదరి ప్రొఫైల్‌ను డెలిట్ చేయడంతో మోసపోయానని గ్రహించిన సాయికృష్ణ కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన సైబర్ క్రైం పోలీసులు నిందితుడు అరుణ్‌చౌదరిని శుక్రవారం జోద్‌పూర్‌లో అరెస్టు చేసి అక్కడి కోర్టులో హాజరుపర్చారు. అక్కడి నుంచి ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్ కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించడంతో శనివారం సాయంత్రం కరీంనగర్ జైలుకు తరలించారు. అతడి వద్ద నుంచిడి బాధితుడు మోసపోయిన రూ.1.58 లక్షలు రికవరీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో కరీంనగర్ సైబర్ క్రైం అధికారి నరసింహారెడ్డితో పాటు పాల్గొన్న అధికారులు, సిబ్బందిని అభినందించింది.

గంభీరావుపేట(సిరిసిల్ల): ఆ పల్లె ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. పంటల సాగులోని కష్టనష్టాలు తెలుసు. అవేమి వారి పిల్లలు పడకూడదని ఉన్నత చదువులు అందించారు. ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులే కాకుండా న్యాయవిద్య చదువుతున్నారు. ఇప్పటికే గ్రామంలో ఇద్దరు జడ్జీలు, 30 మంది లాయర్లు, మరో 10 మంది వరకు క్లర్క్‌లుగా కోర్టులలో ఉద్యోగాలు చేస్తున్నారు. నల్లకోటు ధరించే వారి సంఖ్య గ్రామంలో అత్యధికంగా ఉండడంతో గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట కాస్త లాయర్లపేటగా స్థానికులు పిలుచుకుంటున్నారు. ఆ గ్రామ విశేషాల్లో ఓసారి పరిశీలిద్దాం..



- లింగన్నపేటలో 30 మంది అడ్వకేట్లు
- ఇద్దరు జడ్జీలు.. 10 మంది క్లర్క్‌లు
- హైకోర్టు న్యాయవాదులుగా గ్రామస్తులు

లాయర్లపేట

సండే స్పెషల్

జిల్లా కేంద్రానికి సుదూరంగా..

జిల్లా కేంద్రానికి 35 కిలోమీటర్ల దూరంలో లింగన్నపేట ఉంటుంది. గ్రామంలో దాదాపు 6వేల జనాభా ఉంటుంది. గ్రామస్తులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. చదువు విలువను గుర్తించిన ఆ గ్రామస్తులు తమ పిల్లలకు ఉన్నత విద్యనందించారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులతోపాటు అత్యధిక సంఖ్యలో లాయర్లు ఉన్నారు. 30 మంది లాయర్లు, 10 మంది క్లర్క్‌లు కోర్టులలో పనిచేస్తున్నారు. ఇద్దరు న్యాయమూర్తులు(జడ్జీలు) ఇందిర, శ్రీనివాస్‌రావు కూడా ఉన్నారు. ఇదే ఊరుకు చెందిన రాంచందర్‌రావు అనే న్యాయవాది గతంలో ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. కాగా, మొట్టమొదటిసారిగా లింగన్నపేట నుంచి పి.లింగారావు అనే వ్యక్తి లాయర్ వృత్తిచేపట్టారు. ఆయన చూపినబాటలో ప్రస్తుతం వీరంతా సాగుతున్నారు. అందరివి వ్యవసాయ కుటుంబాలే. గ్రామంలో వీరికి సాగు భూములు కూడా ఉన్నాయి. సెలవుల్లో, పండుగ రోజుల్లో, బంధువుల ఇళ్లలో జరిగే శుభకార్యాల సందర్భంలో లాయర్లు లింగన్నపేటకు వస్తుంటారు. న్యాయపరమైన సమస్యల పరిష్కారంలో గ్రామస్తులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు.


లింగన్నపేట గ్రామం

పాతికేళ్లుగా న్యాయవాద వృత్తిలోనే..



మాది లింగన్నపేట. నేను 1998 నుంచి న్యాయవాదిగా పనిచేస్తున్నాను. మాది సాధారణ వ్యవసాయ కుటుంబం. వృత్తిరీత్య హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో స్థిర పడ్డాను. గతంలో హైకోర్టులో పనిచేశాను. ప్రస్తుతం రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కోర్టులలో పనిచేస్తున్నాను. బోడుప్పల్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా 2023 నుంచి పనిచేస్తున్నాను. మున్సిపల్‌కు సంబంధించి న్యాయపరమైన అంశాలను నేనే చూసుకుంటున్నాను.

– యామన్నగారి అర్జున్‌రావు, న్యాయవాది

గర్వంగా చెప్పుకుంటాం



మా ఊరు లింగన్నపేట నుంచి దాదాపు 30 మంది లాయర్లు, ఇద్దరు జడ్జీలు, క్లర్క్‌లు ఉండడం మాకు సంతోషంగా ఉంటుంది. అప్పుడప్పుడు గర్వంగా చెప్పుకుంటాం. సాధారణ వ్యవసాయ కుటుంబాల నుంచి లాయర్లుగా ఎదిగి, హైదరాబాద్‌లో స్థిరపడ్డ వారు ఉన్నారు. వీలైనప్పుడు ఊరికి వస్తుంటారు. గ్రామస్తులకు కూడా సహాయ సహకారాలు అందిస్తుంటారు.

– లింగన్నగారి దయాకర్‌రావు, గ్రామస్తుడు

37 ఏళ్లుగా పని చేస్తున్నా



మాది లింగన్నపేట గ్రామం. నేను 37 ఏళ్లుగా క్లర్క్‌గా పనిచేస్తున్నాను. మా ఊరి నుంచి చాలా మంది లాయర్లు, క్లర్క్‌లు ఉన్నారు. క్లర్క్‌లుగా పనిచేసి లాయర్లు అయిన వారు కూడా ఉన్నారు. ఈ వృత్తిలో కొనసాగడం సంతృప్తికరంగా ఉంది. వీలైనంతగా మా ఊరి వాళ్లకు న్యాయపరమైన సలహాలు, సూచనలు అందిస్తుంటాం.

– లింగన్నగారి సురేందర్‌రావు, క్లర్క్

'అల్ఫోర్స్'లో చెస్ దినోత్సవం


చెస్ ఆడుతున్న విద్యార్థులు

కొత్తపల్లి: అంతర్జాతీయ చెస్ దినోత్సవం పురస్కరించుకుని శనివారం కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో విద్యార్థులకు స్నేహపూర్వకమైన చెస్‌పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు 6,7వ, తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో 70 మంది బదిలీ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖలో శనివారం 70 మంది సిబ్బంది బదిలీలు అయ్యారు.46 మంది జూనియర్ అసిస్టెంట్లు, 03 షరాఫ్‌లు, 21 మంది అటెండర్లను బదిలీ చేశారు. ఒకటి రెండు రోజుల్లో సబ్‌రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్‌లు సైతం బదిలీ కానున్నట్లు సమాచారం.

స్టార్టర్ల చోరీ

కమాన్‌పూర్(మంథని): గుండారం సమీపంలోని పంట పొలాల వద్ద ఉన్న బోరుమోటార్ల స్టార్టర్లను శుక్రవారం రాత్రి దొంగలు చోరీ చేసినట్లు రైతులు తెలిపారు. బోరు మోటార్లకు ఏర్పాటు చేసిన స్టార్టర్లతోపాటు విద్యుత్ తీగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వివరించారు.

గొంతు నులిమి.. గోనెసంచిలో మూటకట్టి

- బండకట్టి బావిలో పడేసి..
- అప్పు చెల్లించాలని అడిగినందుకు హత్య
- వీడిన మహిళ మృతి మిస్టరీ
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన గోదావరిఖని ఏసీపీ రమేశ్

మంథని: ముత్తారం మండలం పారుపల్లి మార్గంలోని వ్యవసాయ బావిలో గోనెసంచిలో శవమై తేలిన మహిళ మృతి మిస్టరీ వీడింది. ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించాలని అడిగినందుకు ఆమెను హత్య చేసినట్లు గోదావరిఖని ఏసీపీ రమేశ్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలు వెల్లడించారు. ముత్తారానికి చెందిన పెరక రాజేశ్వరి(65) పలు దఫాలుగా సమీపంలోని అమ్ము రజిత ఉరఫ్ లావణ్యకు రూ.1.50లక్షల అప్పు ఇచ్చింది. కొద్దికాలం తర్వాత అప్పు తిరిగి చెల్లించాలని రజితపై ఒత్తిడి తెచ్చింది. ఈక్రమంలో ఇద్దరి మధ్య గడవలు జరుగుతున్నాయి. అయితే, రాజేశ్వరిని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్న రజిత ఉరఫ్ లావణ్య.. అప్పు తిరిగి చెల్లిస్తామని రాజేశ్వరిని ఈనెల 5న తన ఇంటికి పిలిపించింది. తన భర్త రవి, మరో వ్యక్తి కుక్కముడి తిరుపతితో కలిసి రాజేశ్వరి గొంతు నులిమి చంపేశారు. ఆ తర్వాత గోనె సంచుల్లో కుక్కి పారుపల్లి మార్గంలోని వ్యవసాయ బావిలో పడేశారు. ఈనెల 8న మూట కట్టిన మహిళ మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు బృందాలుగా ఏర్పడి విచారణ జరపగా అదే గ్రామానికి చెందిన అమ్ము రజిత ఉరఫ్ లావణ్యతోపాటు ఆమె భర్త రవి, కుక్కముడి తిరుపతి హత్య చేశారని తేలింది. అంతేకాదు రాజేశ్వరిపై ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు అపహరించి వరంగల్‌లో విక్రయించారు. హత్యలో ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. హత్యలో పాలుపంచుకున్న ముగ్గురిని ముత్తారంలో అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వివరించారు. సీఐ వెంకటేశ్వర్లు, ముత్తారం, మంథని ఎస్సైలు మధుసూదన్, వెంకటకృష్ణ, కానిస్టేబుళ్లు దుబాసి రమేశ్, బాలగాని కిరణ్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న గోదావరిఖని ఏసీపీ రమేశ్

పంచాయతీల్లో మూకుమ్మడి బదిలీలు

- 11 మంది ఎంపీవోలు, 260 మంది కార్యదర్శులకు స్థానచలనం

పెద్దపల్లిరూరల్: జిల్లా పంచాయతీశాఖను కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రక్షాళన చేశారు. ఏళ్లకేళ్లుగా ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్నారని భావించి.. పాలనలో సమూలమార్పు తేవాలనే లక్ష్యంతో బదిలీలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో 13 మంది మండల పరిషత్ అధికారులు (ఎంపీవోలు) ఉండగా అందులో 9 మందిని బదిలీ చేశారు. మంథని, ముత్తారం (మంథని) ఎంపీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. (మంథని ఎంపీవో ఆరిఫ్‌ను కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేయగా, ఓదెల ఎంపీవో వాజిద్ సిరిసిల్లకు బదిలీ అయ్యారు). కమాన్‌పూర్ ఎంపీవో శేషయ్య సూరి జోనల్ బదిలీల్లో తనకు అన్యాయం జరిగిందని భావించి కౌన్సెలింగ్‌కు గైర్హాజరయ్యారు. రామగిరి ఎంపీవో భాస్కర్ తన భార్య పని చేసే సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు వెళ్లాలనే యోచనతో కౌన్సెలింగ్‌లో పాల్గొనలేదని సమాచారం.

బదిలీ అయిన ఎంపీవోలు..

మంథని, ముత్తారం ఎంపీవో పోస్టులు ఖాళీగా ఉండగా, ఎలిగేడు, కమాన్‌పూర్ పోస్టులను ఉన్నతాధికారులు బ్లాక్‌డ్ అని రాశారు. పెద్దపల్లి ఎంపీవోగా ఫయాజ్ అలీ, పాలకుర్తి ఎంపీవోగా సుదర్శన్, అంతర్గాం ఎంపీవోగా వేణుమాధవ్, ధర్మారం ఎంపీవోగా కిరణ్, జూలపల్లికి అనిల్‌రెడ్డి, ఓదెలకు షబ్బీర్ పాషా, రామగిరికి రమేశ్, కాల్వశ్రీరాంపూర్ ఎంపీవోగా గోవర్ధన్, సుల్తానాబాద్ ఎంపీవోగా సమ్మిరెడ్డిని బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

260 పంచాయతీ కార్యదర్శులు..

జిల్లాలో 267 గ్రామ పంచాయతీలుండగా.. కమాన్‌పూర్, ఓదెల మండలం లంబడితండ, రామగిరి మండలం పెద్దంపేట, ముత్తారం మండలం ఇప్పలపల్లి కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం 263 మంది కార్యదర్శులు పనిచేస్తున్నారు. అందులో ముగ్గురు వివిధ కారణాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకాలేదు. 260మంది బదిలీ పూర్తయింది.

కుదిపేసిన బదిలీలు..

పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలను ఆకస్మికంగా బదిలీ చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకోవడం పంచాయతీ శాఖను కుదిపేసింది. కార్యదర్శుల్లో 40 శాతం మించకుండా బదిలీ చేయాల్సి ఉందని, ఇలా చేయడం సరికాదని కొందరు తమశాఖ ఉన్నతాధికారి వద్ద మొరపెట్టుకున్నట్లు తెలిసింది.

నేటినుంచి బదిలీలకు బ్రేక్..

ప్రభుత్వం బదిలీల ప్రక్రియకు ఈనెల 20వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఏళ్లకేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారిని బదిలీ చేసినట్లు సమాచారం.


కౌన్సెలింగ్‌లో కలెక్టర్ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్, అరుణశ్రీ

పారదర్శకంగానే బదిలీలు

జిల్లాలో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ పారదర్శకంగానే జరిగింది. నిబంధనల ప్రకారమే కలెక్టర్, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ల సమక్షంలో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేశారు.

– ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి

కాలువలో పడిపోయిన కారు

- తప్పిన ప్రాణాపాయం

సుల్తానాబాద్(పెద్దపల్లి)/సుల్తానాబాద్‌రూరల్: : పట్టణంలోని స్వప్నకాలనీ వద్ద సినిమా టాకీస్ సమీపంలో శనివారం ఓ కారు అదుపుతప్పి రాజీవ్ హైవే పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఓ కారు స్వప్నకాలనీ వద్ద రోడ్డుపై యూటర్న్ తీసుకుంటోంది. ఇదే సమయంలో కరీంనగర్ నుంచి మహదేవపూర్ వెళ్తున్న మరో కారు దానిని తప్పించబోయి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. అందులోని వల్లపు రవి, రెడ్డి రమేశ్‌తోపాటు ఓ బాబు, ఇద్దరు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు. వీరిలో ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాలువలో పడ్డ కారును క్రేన్‌సాయంతో బయటకు తీసి పోలీస్‌స్టేషన్ తరలించారు.


కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు


సురక్షితంగా బయటపడిన తల్లీకూతుళ్లు

బావిలో పడిన నక్కలను రక్షించిన అటవీశాఖ అధికారులు


వల నుంచి నక్కలను బయటకు తీస్తున్న అటవీశాఖ అధికారులు

కథలాపూర్: కథలాపూర్ మండలం బొమ్మెన శివారులోని ఓ వ్యవసాయ బావిలో పడిన రెండు నక్కలను అటవీశాఖ అధికారులు బయటకు తీసి అడవిలో వదిలేశారు. బొమ్మెన శివారులో తుర్తి నవీన్ వ్యవసాయ బావిలో శుక్రవారం రాత్రి రెండు నక్కలు పడ్డాయి. గమనించిన నవీన్ అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. శనివారం ఉదయం అటవీశాఖ డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎండీ.ముషిరొద్దీన్, బీట్ ఆఫీసర్ గాండ్ల మధు రైతుల సహకారంతో నక్కలను వలల సాయంతో బయటకు తీశారు. అనంతరం వాటిని అడవిలో వదిలిపెట్టారు.

జ్యోతిష్మతిలో క్లౌడ్ కంప్యూటింగ్, డాటా అనలిటిక్స్‌పై శిక్షణ


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్: జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్) కళాశాలలో ఎడ్యునెట్ ఫౌండేషన్ అసోసియేషన్ ట్రైనర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ డాటా అనలిటిక్స్‌పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. మూడు రోజులపాటు బీటెక్ ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థినీవిద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐబీఎం, కోడ్ ఉన్నతి, ఎడ్యునేట్ ఫౌండేషన్, షాప్, టాస్క్ ద్వారా వివిధ సరికొత్త టెక్నాలజీస్‌పై విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించారు. ఐబీఎం కోర్సు శిక్షణ బయట నేర్చుకోవాలంటే ఒక గంటకి 80డాలర్లు ఖర్చవుతుందని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఆలోచించి కళాశాలలో ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు వ్యక్తిగత నైపుణ్యం పెంపొందించుకొని ప్రపంచవ్యాప్తంగా ధ్రువీకరించబడిన సర్టిఫికెట్లు అందుకుంటారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్‌రావు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ పీకే వైశాలి, సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ జగదీశన్, కోఆర్డినేటర్ సింధుషా పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐలకు ఆధార్ తప్పనిసరి కాదు

- చార్టర్డ్ అకౌంటెంట్ ఎం.సంతోష్‌రెడ్డి
- 'సాక్షి'తో పలు వివరాలు వెల్లడి



సిరిసిల్ల : విదేశాల్లో స్థిరపడి ఆదాయం పొందుతూ.. పుట్టి పెరిగిన ప్రాంతాల్లో ఆస్తులు సంపాదించే వారు ఎందరో ఉన్నారు. బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లడం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పరిపాటి. కానీ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లి.. అక్కడే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, భవన నిర్మాణ రంగాల్లో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐ (ప్రవాస భారతీయులు) చాలా మంది ఉన్నారు. వీరంతా ప్రతీ నెల ఇక్కడే ఉంటున్న తమ కుటుంబ సభ్యులకు డబ్బులు పంపిస్తుంటారు. అయితే వారంతా మన వద్ద ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంటుందా? ఎంతమేరకు చెల్లించాలి? విదేశాల నుంచి ఏడాదిలో గరిష్టంగా ఎంతమేరకు పంపవచ్చు? ఎన్‌ఆర్‌ఐలకు ఆధార్ కార్డు ఉండాలా? వంటి ప్రశ్నలకు కరీంనగర్‌కు చెందిన ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ ఎం.సంతోష్‌రెడ్డి 'సాక్షి'తో మాట్లాడారు.

ఎంత సొమ్ము అయినా పంపించవచ్చు

ఉద్యోగ, ఉపాధి కోసం వివిధ దేశాల్లో స్థిరపడ్డ ఎన్‌ఆర్‌ఐలు ఇండియాలో ఉన్న రక్తసంబంధీకులకు ఎంత మొత్తంలోనైనా డబ్బులు పంపవచ్చు. దీనికి ఆర్‌బీఐ సీలింగ్ ఏమి విధించలేదు. ఇది మంచి ట్యాక్స్ ప్లానింగ్ అంశం. ఆదాయ పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు. విదేశాల్లో చదువులకు, ట్రీట్‌మెంట్‌కు, అప్పులకు, అవసరాలకు డబ్బులు పంపవచ్చు. ఒక వేళ ఇండియాలోని స్థిరాస్తులను విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బులను ఎన్‌ఆర్‌ఐలు విదేశాలకు తీసుకెళ్లవచ్చు. కానీ ఒక్క ఆర్థిక సంవత్సరంలో ఒక్క మిలియన్ యూఎస్ డాలర్లు (అంటే రూ.8కోట్ల)కు మించి తీసుకెళ్లడానికి అవకాశం లేదు.

పన్ను చెల్లించాలి

ఏటా రూ.3లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్న ఎన్‌ఆర్‌ఐలు తప్పనిసరిగా ఆదాయపన్ను రిటర్న్ ఫైల్ చేయాలి. ఎన్‌ఆర్‌ఐలకు ఇండియాలో సాధారణంగా స్థిరాస్తులపై అద్దె, ఎన్‌ఆర్‌వో అకౌంటర్‌లో వడ్డీ, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ నుంచి డెవిడెండ్, షేర్ మార్కెట్ ట్రేడింగ్ లాభాలు వంటి ఆదాయాలపై పన్నులు చెల్లించాల్సిందే. ఒక్కోసారి ఎన్‌ఆర్‌ఐలకు ఇండియన్ కంపెనీల నుంచి జీతాలు వస్తుంటాయి. ఇలాంటి ఆదాయం రూ.3 లక్షలు దాటితే ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒక వేళ ఎన్‌ఆర్‌ఐలకు ఇండియాలో ట్యాక్స్ పరిధిలోకి వచ్చే వ్యవహారం ద్వారా పేమెంట్ చేయాల్సి వస్తే ఫామ్ 15సీఏ/15 సీబీ ఫైల్ చేస్తేనే బ్యాంకర్ డబ్బులు ఎన్‌ఆర్‌ఐకి పంపించడం జరుగుతుంది. ఏమైనా సందేహాలు ఉంటే సీఏను సంప్రదించాలి.

వ్యవసాయభూములు కొనరాదు

భారతీయ చట్టాల ప్రకారం ఎన్‌ఆర్‌ఐలు ఇండియాలో వ్యవసాయ భూములు కొనరాదు. ఇతర స్థిరాస్తులు కొనుగోలు చేయవచ్చు. ఇండియా వ్యవసాయాధారిత దేశం కావడంతో ఎన్‌ఆర్‌ఐలు వ్యవసాయ భూములు కొంటే.. పడావులుగా ఉంచుతారని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తారని ఈ నిబంధనలు పెట్టారు. కానీ వారసత్వంగా వచ్చే వ్యవసాయ భూములను వారి పేరిట మార్చుకోవచ్చు, అనుభవించవచ్చు.

పన్ను చెల్లించకుంటే శిక్ష

ఆదాయపన్ను చట్టం 1961 ప్రకారం ఎన్‌ఆర్‌ఐలకు ఇండియాలో పన్నులు చెల్లించే ఆదాయం ఉండి కూడా రిటర్నులు ఫైల్ చేయకుంటే శిక్షార్హులు అవుతారు. వడ్డీలు, ఫెనాల్టీలతో సహా డిమాండ్ నోటీస్ అందిస్తారు. దానికి స్పందించకపోతే ఎన్‌ఆర్‌ఐలకు చెందిన ఇండియాలోని బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేస్తారు. స్థిరాస్తులను అటాచ్ చేస్తారు. ఎన్‌ఆర్‌ఐ నివసించే దేశంలోని మన ఎంబసీ ద్వారా చర్యలు తీసుకుంటారు.

పాన్‌కార్డు ఉండాలి

ఇండియాలో ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలంటే తప్పనిసరిగా పాన్‌కార్డు ఉండాలి. ఎన్‌ఆర్‌ఐకి ఆధార్ కార్డు తప్పనసరి కాదు. ఆధార్‌కార్డు కావాలంటే.. ఇండియన్ అడ్రస్‌తో సరైన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవచ్చని యూఐడీఏఐ నిబంధనలు చెబుతున్నాయి.

'పీటీఎం'తో సమస్యకు పరిష్కారం

పెద్దపల్లిరూరల్: 'ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బోధన ఎలా అందుతోంది.. మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉంటోందా.. మౌలిక వసతులు ఎలా ఉన్నాయి..' ఇలా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై ఉపాధ్యాయులతో చర్చించేందుకు శనివారం పేరెంట్– టీచర్ మీటింగ్(పీటీఎం) సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. జిల్లాలో కురుస్తున్న వర్షంతో పలు పాఠశాలల్లో పీటీఎంలు మొక్కుబడిగానే సాగినట్లు సమాచారం. విద్యాశాఖ ఉన్నతాధికారులు, అధికారులు సిబ్బంది హాజరై పీటీఎంల తీరు పర్యవేక్షించారు.

'సార్'ల విరాళాలతో.. కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం హెచ్‌ఎం మాధురి అధ్యక్షతన జరిగిన సమావేశానికి సమగ్ర శిక్షా జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ మల్లేశంగౌడ్ హాజరయ్యారు. వాటర్ ట్యాంకు ద్వారా తాగునీరు సరఫరా లేక ఇబ్బంది పడుతున్నారని, సమస్యకు పరిష్కారం చూపాలని ప్రస్తావన వచ్చింది. స్పందించిన మల్లేశంగౌడ్.. తనవంతుగా విద్యుత్ మోటారు కొనుగోలుకు రూ.5వేలు విరాళంగా ప్రకటించారు. అదే స్కూల్‌లో పనిచేస్తున్న కలకొండ శ్రీనివాస్‌రెడ్డి తనవంతుగా మరో రూ.5వేల విరాళం ఇచ్చేందుకు ముందుకొచ్చారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్టు కార్మికుడి మృతి

జ్యోతినగర్(రామగుండం): అప్పుల బాధ భరించలేక జీవితంపై విరక్తి చెందిన ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు పన్నాల శ్రీనివాస్(60) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనివాస్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనిలో కుటుంబంతో నివసిస్తున్నాడు. అప్పుల బాధతో శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం అనంతరం స్వస్థలమైన అంతర్గాం మండలం ముర్మూర్‌కు తరలించారు.